(IJRSSH) 2013, Vol. No. 3, Issue No. II, Apr-Jun **ISSN: 2249-4642**

# తెలంగాణ కథా సాహిత్యంలో కర్షక వృత్తి – చిత్రణ

# TELANGANA KATHA SAHITYAMULO KARSHAKA VRITTI-CHITRANA

**జి. సుకన్య, తెలుగుశాఖ, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్.**

**G.Sukanya**

*Department of Telugu, Government City College, Hyderabad*

## ABSTRACT

*Telangana Stories in Telangana Story Literature Modern story was born in 1942 on the land of Telangana which was crushed under the iron feet of Nizam. In 1910, Gurjada's story 'Diddubattu' was published in Andhra Bharati, and Madapati Hanumantha Rao's story 'Hridayashalyam' was also published in 1912. Although there is an argument that Acchamamba's 'Dhanathrayodashi' was written in 1902 before Gurjada's story, the narrative features have gained popularity as the first story due to various reasons.*

తెలంగాణ కథా సాహిత్యంలో తెలంగాణ కథలు నిజాం ఉక్కు పాదం కింద నలిగిపోయిన తెలంగాణ గడ్డమీద 1942లోనే ఆధునిక కథ పుట్టింది. 1910లో గురజాడ 'దిద్దుబాటు' కథ ప్రచురింపబడిన ఆంధ్రభారతిలోనే మాడపాటి హనుమంతరావు వ్రాసిన 'హృదయశల్యం' కథ కూడా 1912లో అచ్చయింది. గురజాడ కథకు పూర్వమే అచ్చమాంబ 'ధనత్రయోదశి' 1902లో కథ వచ్చిందన్నారన్న వాదన ఉన్నా కథానిక లక్షణాలు వివిధ కారణాల వల్ల దిద్దుబాటు మొదటి కథగా ప్రాచుర్యాన్ని సంతరించుకుంది.

తెలంగాణ నుండి మాడపాటి హనుమంతరావు తొలి కథకుడిగా 'హృదయశల్యం' మొదటి కథగా తెలంగాణ కథా ప్రస్థానం మొదలయింది. ఈ కథ ఇదివరకే కొన్ని సంకలనాల్లో ప్రచురితమవడం చేత తెలంగాణ మొదటి కథతో కాకుండా తెలంగాణ మొదటి కథకుడు మాడపాటి హనుమంతరావు 'ఎవరికి అనేది' మొదటి కథ.

భారతదేశం కర్మభూమి, వేదభూమి, కర్షకభూమిగా ప్రసిద్ధి చెందింది. ఆర్థికశాస్త్రం భారతదేశాన్ని వ్యవసాయ దేశంగా తెలియజేస్తూ నూటికి 70 శాతం ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారని అభివర్ణించింది. ప్రపంచంలో భారతీయత, భారతీయ సంస్కృతి ప్రఖ్యాతం కావడానికి ప్రధానకారణం గ్రామీణ సంస్కృతి. ఆ సంస్కృతి మూలకం వ్యవసాయం. ఆ వ్యవసాయాన్నే

(IJRSSH) 2013, Vol. No. 3, Issue No. II, Apr-Jun **ISSN: 2249-4642**

జీవనాధారవృత్తిగా మలుచుకొని జీవనం సాగిస్తున్నవారే రైతులు. ఆ 'రైతులు దేశానికి వెన్నముకలు' అన్న గాంధీ గారి మాటలు అక్షరసత్యంగా చెప్పవచ్చును.

వ్యవసాయానికి మూలనిధి భూమియే. ప్రపంచంలోని మానవాళికంతటికి బ్రతుకునిచ్చేది, సజీవశక్తినిచ్చేది ఆ భూమి నుండి ఉద్భవించిన పంటలే ఆధారం. ఆ పంటల్ని పండించేది రైతే. ఆహార ధాన్యాల సృష్టికర్తయైన రైతుకు సాహిత్యంలో పూర్తి స్థానం లభించలేదనే చెప్పవచ్చు. ఈ సాహిత్యంలో రైతు ప్రసక్తి ఉన్నా రైతుని కథా నాయకున్ని చేసి రాసిన సాహిత్యం తక్కువే. దువ్వూరి రామిరెడ్డి రాసిన 'రైతుకావ్యం', వానమామలై జగన్నాథాచార్యులు రాసిన 'రైతు రామాయణం' రైతుని పూర్తిస్థాయి నాయకున్ని చేసి రాయబడిన గ్రంథాలు.

తెలుగు కథా సాహిత్యంలో రైతుపై కథలు ఉద్యమస్థాయిలో చాలా తక్కువగా వచ్చినా, కథ మొదలయ్యింది ఏతం పోయడం, మోటగొట్టడం, నాగలిదున్నడం, పంటమార్చడం, కలుపుతీయడం, బంతికట్టడం మొదలైన పనులన్నీ చేస్తుంది రైతులే, రైతు కుటుంబాలే. రైతు కథలపై అనేక కథలు వచ్చాయి. 'రైతు కథలు' పేరుతో సాకం నాగరాజు తీసుకొచ్చిన పుస్తకం రైతు జీవితాన్ని వివిధ కోణాల్లో ఆవిష్కరించిన కథా పుస్తకం.

తెలంగాణ విముక్తిలో అత్యంత ప్రధానమైంది రైతాంగ పోరాటం. 'రైతే రాజు' అని రైతుని రాజుగా భావించిన ఉద్యమకవి దాశరథి. ఆ రైతుకు దండాలు అర్పించడంలో ఆశ్చర్యం లేదు అని

**"ఎన్ని పుణ్యాలు చేసి జన్మించినావో**
**ఈ ధరా భామినీ మధురాధరాన**
**అమృత మొలకించినావు నీ హలముతోడ**
**హాలకా! వేన వేల దండాలు నీకు"**

"నీ వంటి స్వయం ప్రపోషణ విభావము రాజుల కబ్బజాలున" అని రైతును రాజుకంటే అధికునిగా గుర్తింపజేసాడు.

రైతుగానీ, కూలీలుగాని ఆరుగాలం ఏ మట్టిలో కష్టపడుతుంటారో అదే మట్టి వాళ్ళకు ప్రతిఫలాన్నందిస్తుంది. కాబట్టి కర్షకుడు పొలాన్ని తన ప్రాణంతో సమానంగా చూస్తాడు, దాంతో వాళ్ళ మధ్య ఒక సజీవ సంబంధం ఏర్పడుతుంది. కాబట్టి కర్షకుడు "భూమి నా ప్రాణం రా! దాన్ని అమ్మేది అంటే తల్లిని అమ్మినట్టేరా" అంటాడు.

వానమామలై వరదాచార్యులు 'పోతన చరిత్రము'లో

(IJRSSH) 2013, Vol. No. 3, Issue No. II, Apr-Jun **ISSN: 2249-4642**

**"హలికు నుదిటిపై నలరు చెమ్మట జాలు**
**పాలకు నుదుట ముత్యాల చాలు"**

వంటి పంక్తులు శ్రమజీవుల మూల్యాన్ని వర్ణిస్తున్నాయి. ఇంకా తెలంగాణ ప్రజల జీవన స్థితిగతలను దర్శించాలంటే గంగుల శాయిరెడ్డి గారి కాపుబిడ్డ (1937) పల్లా దుర్గయ్య గారి గంగిరెద్దు (1956), సి. నారాయణ రెడ్డి గారి ఋతుచక్రం (1964) వానమామలై వరదాచార్యులు గారి పోతన చరిత్ర (1966) వానమామలై జగన్నాథాచార్యులు రైతు రామాయణం (1980), మొదలైనవి పరిశీలించదగ్గ కావ్యాలు. ఇవే కాకుండా దాశరథి, కాళోజి, రచనల్లో కూడా తెలంగాణ గ్రామ ప్రజల జీవన విధానాన్ని కూడా దర్శింపవచ్చు. ఇవన్నీ కూడా గ్రామ సంబంధమైన వృత్తులనూ, ఆచార వ్యవహారాలనూ, పండుగలనూ, జాతరలనూ, ఆటపాటలనూ ఆహార విషయాలను దృష్టిలో పెట్టుకుని రచించారు. కర్షక జీవన చిత్రణ అనగానే మనకు ముఖ్యంగా కనిపించే కథకుల్లో 1956 వరకు కలం పట్టిన వారిని తొలితరం కథకులుగా, ఆ తర్వాత కాలం నుండి 1970-75 వరకు కలం పట్టిన వారిని మలితరం కథకులుగా, 1975-90 వరకు కలం పట్టిన వారిని మూడవ తరం కథకులుగా 1990 తర్వాత కలం పట్టిన వారిని ఈ తరం కథకులుగా ప్రాధాన్యతను ఇచ్చాం. మూడవ తరంలో అన్ని వర్గాల నుండి తెలంగాణ కథలు ఉప్పెనలా విజృంభించాయి. అట్టడుగు జీవితాలే కథకు కథా వస్తువులయ్యాయి.

తెలంగాణ కథా సాహిత్యం ఆప్యాయతానురాగాలమయం అని చెప్పలేం. జీవితం అక్కడక్కడా కూడా దుర్భేద్యంగా, క్రూరంగా కూడా ఉంటుందని, రైతుల యథార్థ జీవిత సమస్యలు పాఠకుల మనస్సులనే ఛిద్ర పరుస్తుంది. ప్రకృతికీ, రైతుకీ జీవనాధారం నీళ్ళే, సేద్యం జరగాలంటే నీళ్ళెంత ముఖ్యమో బోధనం నర్సిరెడ్డి, బోరుపొక్కులు, పి. చిన్నయ్య మెట్టభూమోడు నిరూపించిన కథలు మొదలైనవి. రైతు యొక్క స్థితిగతులను, ఛిద్రమయిన బ్రతుకులను కళ్ళకు కట్టినట్లు చూపాయి.

తొలిరైతు కథగా పేర్కొన్న మాడపాటి హనుమంతరావు రాసిన 'ఎవరికి' కథలో రైతులు వ్యవసాయానికి పెట్టుబడి పెట్టలేక అప్పులు చేసి జమిందారి దౌర్జన్యాలకు ఏ విధంగా బలై పోయారో వివరించిందీ కథ. సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'గ్యారకద్దూ బారా కొత్వాల్' కథలో ఒక పేద రైతు తాను పండించిన సొరకాయలను అమ్మడానికి వెళ్ళి అక్కడ నవాబు పాలనలోని ఆయగాండ్ల దౌర్జన్యానికి, దురాగతాలకు తట్టుకోలేక బలైపోయిన విధమును వివరించింది. బోధనం నర్సిరెడ్డి రాసిన 'బోరుపొక్కులు' కథలో పొలంలో బోరు వేయడానికి బ్యాంకు రుణం తీసుకుని ఇంకా అప్పుచేసి మూడు వందల అడుగుల లోతు వరకు తవ్వించిన పర్వత రెడ్డి నీరు పడక వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడంతా

IJRSSH

(IJRSSH) 2013, Vol. No. 3, Issue No. II, Apr-Jun ISSN: 2249-4642

వృథా ప్రయాసగా నిలిచింది. చివరకు వ్యవసాయాన్ని వదిలి పట్నంలో ఉన్న కొడుకు వద్దకు చేరాడు.

పంజాల జగన్నాథం రాసిన ‘మృత్యువు పువ్వు’ కథలో కల్తీ విత్తనాల వల్ల పత్తి పూయక, కల్తీ మందుల వల్ల పురుగులు చావక, నష్టపోయి కృంగిపోయి, అనారోగ్యంతో భార్య, ఆత్మహత్య చేసుకుని భర్త చనిపోతారు. ఈ కథలో కమీషన్ల వ్యవస్థ, కల్తీ విత్తనాలు అమ్మడం వల్ల చనిపోయినట్లు కథకుడు తెలియజేసాడు. పంటపై లాభాలు రాకుండా చివరకు రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించింది.

భాస్కరభట్ల కృష్ణారావు రాసిన ‘ఇజ్జత్’ లో కౌలు చెల్లించలేని స్థితిలో ఉన్న పేద రైతు మల్లయ్య ఊరి కరణం చేసిన అపనిందను తట్టుకోలేక ఉరేసుకుని చనిపోయిన విషయాన్ని తెలియచేశాడు. రైతు తన ప్రాణం కన్నా అభిమానమే ఎక్కువ అని నిరూపించిందీ కథ.

మందా రామిరెడ్డి ‘సర్కారు కిస్తు’ లో సర్కారు దోపిడీ, దౌర్జన్యాలను తట్టుకోలేక, కిస్తూ కట్టలేక చివరకు రైతు తన భార్యను, తల్లిని, పిల్లలను వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. కథకుడు కోదండయ్య ఎక్కడికి వెళ్ళిపోయాడో పాఠకుల ఊహకే వదిలివేసాడు.

ముదిగంటి సుజాతారెడ్డి రాసిన ‘గుడిసెలు గుడిసెలు’ లో సేద్యం మీద ఆధారపడి జీవించే కుటుంబం, ప్రభుత్వం రైతుల సాగు భూములను సెజ్ గా మార్చి విమానాశ్రయం ఏర్పరిచాక ఆ రైతులు, వారి కుటుంబాలు చిద్రమై, గుడిసెల్లో బ్రతకడం చివరకు భర్తను పోగొట్టుకుని, రైతుభార్య బిక్షగత్తెగా మారడం, కొడుకు తాగుబోతుగా, కోడలు ఇళ్ళల్లో పనిచేసే పనిమనిషిగా మారిపోవడం జరిగిందీ కథలో.

మైరెడ్డి యాదగిరి రెడ్డి రాసిన ‘బతుకు’ కథలో వ్యవసాయం వల్ల ఇళ్ళు, ఒళ్ళు గుల్ల చేసుకొని ఆ వ్యవసాయ భూముల్లో పంటలు పండక, అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీర్చలేక ఆ భూముల్నే చివరకు కరణాలకు అమ్ముకుని ఊరు విడిచి పట్టణాలకు వలసపోయే దయనీయ స్థితులను వర్ణించిందీ కథ.

అల్లం రాజయ్య రాసిన ‘ఎదురుతిరిగితే’ కథలో పొలాన్ని కాజేయాలనే దొర ఆలోచనను చూసి చివరకు దొరను గొడ్డలితో తరిమి కొడతాడు, దొరకు ఎదురు తిరుగుతాడు నీరటికాడు, రైతులు ఎదురు తిరిగే పరిస్థితులను ఈ కథలో గమనించవచ్చు.

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన ‘ఇగ వీడు తొవ్వకు రాడు’ కథలో రైతు తన మిత్రుడైన పంతులు ద్వారా కుమారున్ని మార్చే ప్రయత్నం చేస్తాడు. చివరకు

(IJRSSH) 2013, Vol. No. 3, Issue No. II, Apr-Jun **ISSN: 2249-4642**

వ్యవసాయంపై పంటలు పండక నీళ్ళు లేక కరెంటు కోతతో పంట ఎండిపోవడం చూసి తట్టుకోలేక ఆ వ్యవసాయ భూమిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు తన తండ్రిని ఏ వ్యవస్థ చంపిందో ఆ వ్యవస్థలోని అధికారులపై తిరుగుబాటు చేయడం, రైతు నాయకుడిగా మారడం, పేపర్లలో వచ్చిన వార్తను పంతులు చూసి ఇగ వీడు తొవ్వకు రాడు అని అనుకోవడం ఈ కథలో కన్పిస్తుంది.

తెలంగాణ కథా సాహిత్యంలో కర్షకులు తరతరాలుగా వస్తున్న తమ స్వంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కొత్త ఉత్సహంతో పంటను పండిద్దామనే ప్రయత్నాలు కలగానే మిగిలాయి. ప్రకృతి, పరిస్థితులు కలిసిరాక ఎరువులు, పురుగుల మందులు, కల్తీపై పనిచేయక, పెట్టుబడి కింద తెచ్చిన అప్పులు తీర్చలేక బ్యాంకు రుణాలు కట్టలేక, అప్పుల కింద, కుటుంబ అవసరాల కింద, ఒక్కొక్క ఎకరం భూమిని అమ్ముకోవడం కన్పిస్తుంది. బతుకుమీద కల్గిన ద్వేశంతోనో తాగుడికి బానిసై భూమి మీద ఉన్న మమకారాన్ని చంపుకోలేక తాను అమ్మిన భూమిలోనే కూలీగా మారడం, లేదా పట్నానికి వలసలుగా పోవడం, కర్మాగారాల్లో కార్మికులుగా మారడం, కుటుంబం చిద్రమైపోవడం తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకోవడం వంటి రైతు చిత్రణ మనకు ఈ కథల్లో కన్పిస్తుంది.

## ఆధార గ్రంథాలు

1. రైతు రామాయణం - వానమామలై జగన్నాథాచార్యులు
2. రైతు కథలు -సాకం నాగరాజు
3. పోతన చరిత్రము - వాన మామలై వరదాచార్యులు (1966)
4. గంగిరెద్దు - పల్లదుర్గయ్య (1956)
5. రుతుచక్రం - డా. సి. నారాయణ రెడ్డి (1964)

## BASIC TEXTS

1. Rythu Ramayana - Vanamamalai Jagannathacharyu
2. Peasant Stories -Sakam Nagaraju
3. History of Potana - Vana Mamalai Varadacharya (1966)
4. Gangireddu - Palladurgaiah (1956)
5. Menstruation - Dr. C. Narayana Reddy (1964)

IJRSSH